క్లుప్తంగా

ఎర్నిమాంబ ఆలయంలో ప్రత్యేక దర్శనాలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఫాల్గుణ మాసం ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఆలయ కమిటీ నేతృత్వంలో పూజారి ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలు ఏర్పాటు చేశారు. భక్తులు వంటావార్పు చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సభ్యులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

ఉచిత దంత వైద్య శిబిరానికి విశేష స్పందన



శిబిరాన్ని ప్రారంభిస్తున్న రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్

కంచరపాలెం: జ్ఞానాపురంలోని ఆర్‌సీఎం పాఠశాల ఆవరణలో అనిట్స్ హాస్పిటల్ వైద్యురాలు శ్రేయ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత దంత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సెయింట్ పీటర్స్ కెథిడ్రల్ విచారణకర్తలు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 450 మందికి దంత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యురాలు యాండ్రపు ఫాతిమారాణి, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి యాండ్రపు నిఖిలేష్ రాజ్‌కుమార్, పీపీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతరామరాజు సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న సెంచూరియన్ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య జీఎస్ఎన్ రాజు

అల్లిపురం: కళాప్రపూర్ణ గణపతిరాజు అచ్యుతరామరాజు సాహిత్యం, నాటక రంగాలకు చేసిన సేవలు మరువలేనివని సెంచూరియన్ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య జీఎస్ఎన్ రాజు కొనియాడారు. అచ్యుతరామరాజు స్మారక సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో అచ్యుతరామరాజు శత జయంతి ఉత్సవాలను ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పీసపాటి గిరిజ పాడిన అన్నమాచార్య కీర్తనలు ఆహూతులను అలరించాయి. పెన్మత్స లలితా వాశిష్ఠ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖ సాహితీ అధ్యక్షుడు మల్లాప్రగడ రామారావు, చైతన్య సమితి అధ్యక్షుడు డీవీ సూర్యారావు, సంస్థ ప్రధాన కార్యదర్శి పెన్మత్స జగన్నాథరాజు, కళాకారులు, కళా సంస్థల అధిపతులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా బ్రహ్మోత్సవాలు

కూర్మన్నపాలెం : జీవీఎంసీ 86వ వార్డు పరిధి సైమాన్‌నగర్‌లోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్త, వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షులు పున్నూర్ గౌతం రెడ్డి దంపతులు ఆధ్వర్యంలో 5 రోజులు పాటు స్వామి వారి బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేసి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. ఆలయ పండితులు వేద మంత్రోశ్చరణల మధ్య ఎమ్మెల్యే నాగిరెడ్డిని సాదరంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ఈ బ్రహ్మోత్సవాలకు విజయవాడ నుంచి చిన్న జీయర్ స్వామి శిష్య బృందం విచ్చేసింది.

సేవామార్గాన..

- అగర్వాల్ మహాసభ
- మంచినీటి కేంద్రాల ఏర్పాటు.. శ్మశాన వాటికల అభివృద్ధి
- అభాగ్యులకు వీల్ చైర్లు, వాకర్లు, వాకింగ్ స్టిక్స్ పంపిణీ



వీల్ చైర్లు, వాకర్లు, వాకింగ్ స్టిక్స్ పంపిణీకి చెందిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మహాసభ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: వారంతా ఉత్తర భారతీయులు. మూడు.. నాలుగు దశాబ్దాల కిందట విశాఖపట్నం వలస వచ్చారు. చిరు వ్యాపారాలతో ఇక్కడ వారి ప్రస్థానం ప్రారంభమైంది. వ్యాపారాలు విస్తరించాయి. ఇక్కడే స్థిరపడ్డారు. స్థానికులుగా మారారు. పిల్లల చదువులు కూడా ఇక్కడే సాగుతున్నాయి. వ్యాపారాలు ఊపందుకున్నాయి. ఇక్కడి వారితో కలిసిపోయారు. ఇక్కడి ఆచారాలు.. సాంప్రదాయాలతో మమేకమయ్యారు. సేవా మార్గానికి మళ్లారు. వారికి వచ్చిన సంపాదనలో ఎంతో కొంత సేవ చేసేందుకు ముందుకు వచ్చారు. అందుకు అగర్వాల్ మహాసభ, విశాఖపట్నం పేరిట ఓ సంస్థను ఏర్పాటు చేసుకున్నారు. ఆ సంస్థ పేరిట నగరంలో పలు సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు ఎన్నో సేవా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. ఆర్కేబీచ్, వైఎంసీఏ, జూపార్కు, పూర్ణామార్కెట్ వద్ద మంచినీటి కేంద్రాలు ఏర్పాటు చేశారు. లక్షలాది రూపాయలతో కాన్వెంట్ జంక్షన్ సమీపాన గల హిందూ స్మశాన వాటికను అభివృద్ధి చేశారు. ప్రేమసమాజంలో గోశాల షెడ్ నిర్మించారు. ఇటీవల ప్రేమ సమాజం యువతి వివాహానికి అగర్వాల్ మహాసభ ఆర్థికంగా చేయూతనిచ్చింది. నక్కవానిపాలెం, మద్దిలపాలెంలో గల మున్సిపల్ పాఠశాలల్లో సొంత నిధులతో అభివృద్ధి పనులు చేశారు.



పూర్ణామార్కెట్‌లో అగర్వాల్ మహాసభ ప్రతినిధులు ఏర్పాటు చేసిన మంచి నీటి ట్యాంకు

తాజాగా..

సమాజ సేవలో అగర్వాల్ మహాసభ తాజాగా విభిన్న ప్రతిభావంతులకు ఆపన్న హస్తం అందించేందుకు ముందుకు వచ్చింది. వీల్‌చైర్లు, వాకర్లు, వాకింగ్ స్టిక్స్ పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 14న రాజస్థానీ సాంస్కృతిక మండలి భవనంలో లబ్ధిదారులకు 30 వీల్ చైర్లు, 100 వాకర్లు, 200 వాకింగ్ స్టిక్స్ పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు.

ఎలా దరఖాస్తు చేసుకోవాలి..

లబ్ధిదారులు ఈ నెల 10వతేదీలోగా సంజయ్ అగర్వాల్ 9246620123 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలి. దరఖాస్తుతో పాటు లబ్ధిదారుని ఫొటో, ఆధార్/రేషన్ కార్డు జత చేయాలి. వీల్‌చైర్ లబ్ధిదారులు దరఖాస్తుతో పాటు ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ తర్వాత ప్రభుత్వ వైద్యులు జారీ చేసిన సర్టిఫికెట్ విధిగా జత చేయాలి. ముందు వచ్చిన వారికి ముందు ప్రాతిపదికన ఉచిత పంపిణీ ఉంటుంది.

కళాకారుల వైద్య శిబిరం విజయవంతం



శిబిరంలో సేవలందిస్తున్న వైద్యుల బృందం

దాబాగార్డెన్స్: విశాఖ స్మార్ట్‌సిటీ లయన్స్‌క్లబ్, విశాఖ సంగీత కళాకారుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కళాకారుల మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. సుమారు 300 మంది కళాకారులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. నగరానికి చెందిన ప్రముఖ వైద్యుల పర్యవేక్షణలో షుగర్, బీపీ పరీక్షలతో పాటు దంత పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించారు. జనరల్ ఫిజీషియన్స్ డాక్టర్ కృష్ణ హారిక, సాయి లక్ష్మి, కృష్ణకీర్తి, ఉమా ప్రవల్లిక పాల్గొని అవసరమైన పరీక్షలు చేసి మందులు, కళ్లజోళ్లు అందజేశారు. అనంతరం క్యాన్సర్ వైద్య నిపుణురాలు డాక్టర్ శ్రీప్రభ ఆ వ్యాధిపై అవగాహన కల్పించారు. ముందుగా స్మార్ట్‌సిటీ అధ్యక్షుడు ఎం. త్రినాథరావు, లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఉషారాజు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జోనల్ చైర్‌పర్సన్ రోహిణి రాజు, క్యాబినెట్ సెక్రటరీ యు. జానకీదేవి, కోశాధికారి ఐఎస్ఎన్ రాజు, ఎం. విజయలక్ష్మి, ఎం. గోపాల్, కళాకారుల సంఘం గౌరవ అధ్యక్షుడు కొణతాల రాజు, అధ్యక్షుడు మహ్మద్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు, మెలోడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మోటారు కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

అల్లిపురం: మోటారు కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ రెహమాన్ డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో కాన్వెంట్ జంక్షన్ వెజిటబుల్ మార్కెట్ మోటారు కార్మికులు, డ్రైవర్లు, ఓనర్ల (ఏఐటీయూసీ) జనరల్ బాడీ సమావేశం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తరచూ పెరుగుతున్న పెట్రోల్, డీజిల్‌పై నియంత్రణ ఉండేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భారీగా పెంచిన థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, ఎఫ్‌సీ పర్మిట్, ఎల్ఎల్ఆర్ చలానా చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో యూనియన్ నాయకులు కె.సింహాద్రి, సీహెచ్ కాసుబాబు, స్టాండ్ నాయకులు శివారెడ్డి, బి.బాలరాజు, బి.రాము, కె.గణేష్, కె.వెంకటేష్, పి.మహేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కుబేర పూజ



కుబేర పూజలో పాల్గొన్న జంటలు

అల్లిపురం: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్, వాసవీ క్లబ్ వైజాగ్ క్యాపిటల్ క్లబ్ ఆధ్వర్యంలో టౌన్ కొత్తరోడ్డు దరి జల్లూరి సర్వబాయమ్మ చౌల్ట్రీ ప్రాంగణంలో 108 మంది దంపతులచే కుబేర పూజ అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ మాట్లాడుతూ కుబేర పూజ నిర్వహించడం వల్ల లక్ష్మీ కటాక్షం, ఐశ్వర్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో వాసవీ సంస్థ జోన్ చైర్మన్ పి.రమేష్, వాసవీ క్లబ్ వైజాగ్ క్యాపిటల్ కపుల్స్ కమిటీ ప్రతినిధులు జి.కృష్ణ, ఎస్.ఉదయనాగరాజు, ఎస్.దేవి, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన నీలమ్మ జాతర మహోత్సవాలు



భక్తులకు వడ్డిస్తున్న శ్రీవత్సవ్, విజయలక్ష్మీ

అల్లిపురం: అస్సాం గార్డెన్స్‌లో వెలసిన నీలమ్మ వేప చెట్టు అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు జోగారావు శర్మ విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనను వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సుమారు 1500 మంది అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. అమ్మవారి శివరాత్రి వార్షిక జాతర మహోత్సవాలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి విజయలక్ష్మీ శ్రీనివాసరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో దేవుళ్లు, ట్రస్ట్ బోర్డు సభ్యులు లక్ష్మీకాంతం, కన్నూరు గంగ, భీమరశెట్టి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

స్నేక్ క్యాచర్ కిరణ్ సేవలు విలువైనవి



కిరణ్‌ను సత్కరిస్తున్న భారతీయ వికాస్ పరిషత్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: మహా విశాఖ నగరంలో స్నేక్ క్యాచర్‌గా, సర్పజాతి సంరక్షకునిగా పేరొందిన రొక్కం కిరణ్‌కుమార్‌ను భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర శాఖ ఘనంగా సత్కరించింది. నగరంలోని బీవీపీ కార్యాలయంలో కిరణ్ సేవలను గుర్తిస్తూ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు వంకాయల సన్యాసిరాజు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలతో పాటు సర్పాలను రక్షిస్తున్న కిరణ్‌కుమార్ సేవలు కొనియాడదగ్గవని అన్నారు. సర్పాల కోసం తాను చేస్తున్న సేవలను గుర్తించి సత్కరించినందుకు కిరణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ ప్రధాన కార్యదర్శి జీవీబీ సుబ్రహ్మణ్యం, రాష్ట్ర సంస్కార్ ఎంవీ రాజశేఖర్, ఆర్సీ జైన్, డీహెచ్‌సీ శాస్త్రి, ఎంవీవీ సత్యనారాయణ, ఎంవీ సూర్యనారయణరాజు, చదరం శివాజీ, జి. వేణుగోపాలస్వామి, వీఎస్ఆర్ ఆంజనేయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గీతాభవన్‌లో నక్షత్రమాల



కృష్ణ భగవానునికి పూజలు చేస్తున్న అతిథులు

దాబాగార్డెన్స్: గీతా ప్రచార సమితిని ప్రారంభించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా లోక కల్యాణార్థం నక్షత్రమాల పేరిట 27 నక్షత్రాలకు.. 27 సార్లు భక్తులందరిచే సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ నిర్వహించారు. ముందుగా గీతా మందిరంలో వేంచేసిన విశ్వరూప సహిత శ్రీకృష్ణార్జున ప్రతిష్ఠ మూర్తులకు, గోసహిత శ్రీకృష్ణ భగవానుని ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆధ్యాత్మిక ఉత్సవంలో పాల్గొన్న బ్రహ్మశ్రీ మురళీకృష్ణ భక్తులనుద్దేశించి ప్రసంగిస్తూ శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం వల్ల విశ్వశాంతి కలగడమే గాక పాల్గొన్న వారందరికీ శుభాలు కలుగుతాయని అభిలషించారు. గీతా ప్రచార సమితి గత 50 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక ఉత్సవాలను ఆయన ప్రశంసించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ప్రచార సమితి గౌరవ అధ్యక్షుడు వై. కృష్ణమూర్తి, అధ్యక్షుడు సీహెచ్ విశ్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి జగన్‌మోహన్‌రావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, కార్యదర్శి ఎం. వనజాదేవి, జీవీఆర్ ప్రసాద్, లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

సీతంరాజు గెలుపునకు విస్తృత ప్రచారం



వార్డులో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ చెన్నా జానకీరామ్



హోమ్‌లో అన్నదానం చేస్తున్న కోడిగుడ్ల శ్రీధర్



కొబ్బరితోటలో సీతంరాజు తరఫున ప్రచారం చేస్తున్న తోట పద్మావతి తదితరులు

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపునకు 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ ఆదివారం విస్తృత ప్రచారం చేపట్టారు. సీతంరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలంటూ గ్యాడ్యుయేట్ ఓటర్లకు ఓటర్ స్లిప్పులు, కరపత్రాలు అందజేశారు. వాల్ స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు యేసు, కాసారపు వాసు, రెయ్యి డేవిడ్ రాజు, గోపి, ఆనంద్, వెంకటలక్ష్మి, రోజా, రమణి, జి. శేఖర్ పాల్గొన్నారు.

ఓల్డేజ్ హోమ్‌లో..

కంచరపాలెం: వైఎస్సార్‌సీపీ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్ గెలుపొందాలని కోరుతూ ఆదివారం జెకుతేల్ మినిస్ట్రీస్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఫర్ ఓల్డేజ్ హోమ్ వృద్ధులు, మానసిక దివ్యాంగులకు నిత్యావసర సరకులు, ఫ్యాన్లు, లైట్లు అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం చేసి, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. సీతంరాజు గెలుపు కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు వర్కింగ్ ప్రెసిడెంట్ వేళంగిణిరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీతంరాజు గెలుపుతోనే సమస్యల పరిష్కారం

అల్లిపురం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా సీఎం జగన్ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. కొబ్బరితోట, దుర్గాలమ్మ గుడి ప్రాంతాల్లో కరపత్రాలు అందజేశారు. సీతంరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సీనియర్ నాయకుడు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, కర్రి నీలకంఠం, సచివాలయ కన్వీనర్లు, దూడ అప్పారావు, తాతబ్బాయి, దుర్గారావు, సూరిబాబు, వెంకటేష్, గోవింద్, నర్సింగరావు, రవి, అశోక్, లక్ష్మణ్, వైట్, పరేదశి తదితరులు పాల్గొన్నారు.

'కోలా'కు సత్కారం



కోలా గురువులను సత్కరిస్తున్న సంస్థ సభ్యులు

దాబాగార్డెన్స్: స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు అభినందనీయమని మత్స్యకార కార్పొరేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, ఎమ్మెల్సీ ప్రకటిత అభ్యర్థి కోలా గురువులు కొనియాడారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన మత్స్యకార నేత కోలా గురువులను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో స్వామి వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు నేపథ్యంలో పలువురు సభ్యులు కోలాను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా కోలా గురువులు మాట్లాడుతూ సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. అనంతరం సంస్థ అధ్యక్షుడు సూరాడ మాట్లాడుతూ కోలా గురువులు సేవలు గుర్తించి ఎమ్మెల్సీగా ఎంపిక చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో డి. సత్యనారాయణ, శ్రీరామ్, నాగమణి, సుజాత, లోవరత్న తదితరులు పాల్గొన్నారు.

మంచిగా జీవించండి



ఫోర్త్ టౌన్ పీఎస్ ఆవరణలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న సీఐ శ్రీనివాసరావు



రౌడీ షీటర్లకు సూచనలిస్తున్న ద్వారకా జోన్ సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీ షీటర్లు, పాత నేరస్తులకు సీఐ శ్రీనివాసరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల జోలికి పోకుండా సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు. ఎటువంటి అల్లర్లు చేయకుండా ఉండాలని హెచ్చరించారు. ఎటువంటి తగాదాల్లో తలదూర్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతానికి స్వస్తి పలికి కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని, సమాజంలో మంచిగా నడుచుకోవాలని హితవు పలికారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు ధర్మేంద్ర, ప్రమీల, వెంకటరావు, మోహన్‌రావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ద్వారకా పీఎస్‌లో..

ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు సీఐ సింహాద్రినాయుడు, ఎస్ఐ ధర్మేంద్ర కౌన్సెలింగ్ చేశారు. తగాదాల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి మంచిగా జీవించాలని సూచించారు. రౌడీ షీటర్ల దినచర్యపై ఆరా తీశారు. అల్లరు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గౌరీ పూర్ణిమ ఉత్సవం రేపు

ఎంవీపీ కాలనీ: ఈ నెల 7న ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా మైదానంలో గౌరీ పూర్ణిమ ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకృష్ణ భగవానుడి అవతారమైన శ్రీకృష్ణ చైతన్య మహాప్రభు ఆవిర్భవించిన సందర్భంగా ఈ ఉత్సవం జరగనుంది. శ్రీకృష్ణబలరాముల విగ్రహాలకు అభిషేకం, మహా మంగళహారతి, పుష్పవృష్టి, పల్లకి ఉత్సవం నిర్వహించనున్నారు.

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ లాభమేనా?

దాబాగార్డెన్స్: పారిశ్రామిక అభివృద్ధికి 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్' ఏ విధంగా తోడ్పడుతుందని సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 ఎన్నికల ముందు గ్రౌండ్ అయ్యే పరిశ్రమలు ఎన్ని? అందులో పెట్టుబడులు ఎంత? అందులో ఉపాధి ఎంత? అని ఆయన ప్రశ్నించారు. సమావేశంలో సిటూ ఉపాధ్యక్షుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్ పాల్గొన్నారు.

నాటి ఉక్కు ఉద్యమం నేటి తరానికి స్ఫూర్తి



752వ రోజు ఉక్కు దీక్షలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న మస్తానప్ప

కూర్మన్నపాలెం : విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అనే నినాదంతో జరిగిన నాటి ఉక్కు ఉద్యమం నేటి తరానికి ఉద్యమ స్ఫూర్తి అని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు వై.మస్తానప్ప అన్నారు. ఈ మేరకు 752వ రోజు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షల్లో వైఎస్సార్‌టీయూసీ కాంట్రాక్ట్ కార్మికులు కూర్చొని ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వై.మస్తానప్ప కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతులు సాగించిన పోరాట ఫలితంగా మోడీ ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుందని, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు అటువంటి పోరాటాలు చేయక తప్పదన్నారు. ఉక్కు నిర్వాసితులు చేసిన ప్రాణత్యాగాలను మోడీ ప్రభుత్వం గుర్తు చేసుకోవాలనాన్నరు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే ఉత్పత్తిలో పరుగులు పెడుతూ దేశంలో నంబర్ వన్ పరిశ్రమగా ఎదుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూసీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

జీవో 24 అమలులో చిత్తశుద్ధి అవసరం

సీతంపేట: ప్రైవేట్, ఎయిడెడ్ స్కూళ్లలో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశం కోసం పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలని ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 24పై స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. జీవో 24పై స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో బాలవికాస్ ఫౌండేషన్, రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం సంయుక్తంగా ఆదివారం బీవీకే కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదర సంజీవయ్యలా యూనివర్సిటీ వ్యవస్థాపక వీసీ వై.సత్యనారాయణ మాట్లాడుతూ జీవో నంబర్ 24 అమలులో చిత్తశుద్ధి అవసరమన్నారు. విద్యా హక్కు చట్టం అమలులో ప్రభుత్వంతోపాటు టీచర్లు తమ వంతు పాత్ర పోషించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు తక్కువై డ్రాప్ అవుట్స్ ఉన్న నేపథ్యంలో ఈ అంశంపై కూడా దృష్టి సారించాలని కోరారు. జీవో అమలులో లోపాలను స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వం దృష్టికి తేవాలన్నారు. సంస్థ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం అమలు చేయడంలో ప్రభుత్వం చురుగ్గా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. అమ్మ ఒడి, గోరుముద్ద, విద్యా కానుక వంటి పథకాలు అందులో భాగమేనన్నారు. పూర్తి స్థాయిలో చట్టాన్ని అమలు చేయాలని కోరారు. సమావేశంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గౌరీ శంకర్, అబ్దుల్ బేగ్, నరసింహారావు, హరగోపాల్, మధుసూదనరావు పాల్గొన్నారు.

'టిడ్కో' లబ్ధిదారుల సమస్యల పరిష్కారానికి కృషి



ముత్యమాంబ కాలనీ టిడ్కో గృహ లబ్ధిదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఆనంద్‌కుమార్

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి దయానందనగర్, రాజీవ్ కాలనీ, ముత్యమాంబ కాలనీ ప్రాంతాల్లో నిర్మించిన టిడ్కో ఇళ్లను ఆదివారం వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పరిశీలించారు. ఆ ఇళ్లల్లో నెలకొన్న సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆడారి హామీ ఇచ్చారు. అనంతరం ఆయా కాలనీల్లో పర్యటించి వైఎస్సార్‌సీపీ మద్దతు ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని పట్టభద్రులను కోరారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు ఆడారి శ్రీను, దాసరి శామ్యూల్, మజ్జి నూకరాజు, రామకృష్ణ, పైడిరాజు, జీవా, కన్వీనర్లు రమేష్, త్రినాథ్, హేమ, పి.భవాని గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.